# అర్భకుని ఆవేశం

శ్రీ మధర భానుమూర్తి

క్షిప్తి సుగులో అడుగు వేసుకుంటూ నడుస్తున్నాడు గోపాలం. అలా నడుస్తున్నాడే గాని ఎక్కడికి వెడుతున్నదీ, ఏ రోడ్డు వెంట వెడుతున్నదీ అతనికే తెలియదు. ఏదో ఆలోచిస్తూ పరధ్యానంగా ఉన్నాడు. త్రోవలో తెలుగున్న దుగురు పలకరించారు. పలకలేదు. వారి మాటలు అతనికి వినబడనే లేదు. ఆ పిలిచిన వాళ్ళు కూడా ఏదేనా పని మీద ఉన్నాడేమోనని మళ్ళీ పిలవ లేదు. గోపాలం మాత్రం తన ధోరణిని తను వెడుతున్నాడు.

త్రోవలో ఏ అడ్డూ లేకపోతే ఇంకా ఎంతదూరం వెళ్ళేవాడో కాని ఊరిబయటి పిల్లకాలవదగ్గరికి వచ్చే సరికి ఆగక తప్పింది కాదు. నిజానికి ఆ పిల్లకాలవ లోతు ఎక్కువేమీ కాదు. నిండా నీరుంటే మోకాటి లోతు కంటే ఉండదు. అది ఆ ఊరికీ ప్రక్కఊరికీ సరిహద్దు. ఈ ఊరునుంచి ఆ ఊరు, ఆ ఊరునుంచి ఈ ఊరు నిత్యం వచ్చే పోయే జనం ఆ పిల్లకాలవ ఎన్నిసార్లు దాటుతారో లెక్కలేదు. ప్రవాహానికి అనుగుణ్ణ దాడి, బంద ఉండదు. శుభ్రమైన ఇసుక ఉంటుంది. అందుచేత దాన్ని దాటడం ఎవరికీ కష్టం కాదు. సాయంత్రమయ్యేసరికి రెండు ఊళ్ళనుంచి, పిల్లలు ఆడుకుందుకని వచ్చి బట్టలు విప్పిపెట్టి, చిన్న చిన్న పుట్టగోచీలు పెట్టుకుని ఆ కాలవలో ఈతలు కొడతారు. ఈతలు కొట్టడమంటే పెద్ద పందాలు, గజ ఈతలు కాదు. ఈత నేర్చుకుంటారు. వాళ్ళలో చాలమందికి నేల అందుతుంది ఈదుతుంటే. వాళ్ళు నేలను చేతులతో పట్టుకుని ముందుకు జరుగుతూ కాళ్ళతో నీటిమీద టపటపలాడిస్తూ అదే ఈత అనుకుని మురిసిపోతుంటారు. ఇది వాళ్ళ పెద్ద వాళ్ళకుతెలియదు. పిల్లలుఇంట్లో ఎప్పుడూ స్నానా నికి వెడుతున్నామని చెప్పరు. ఆటలకు వెడుతున్నామనే చెప్తారు. కాని స్నానం చెయ్యనిదే ఒక గంటసేపయినా నీటిలో ఆడుకోనిదే ఇళ్ళకు వెళ్ళరు. వీళ్ళంతా సరిగ్గా కూడబలుక్కున్నట్టు ఒకే చోట బట్టలు పెట్టుకుని దిగుతారు ప్రతిరోజూ. అందుచేతే ఆ చోటును పిల్లలరేవు అని అంటారు. గోపాలం ఈ పిల్లల రేవును చూసే ఆగి పోయాడు.

ఎంత ధ్యానులేనా తప్పించుకుని ముందుకు నడవ గలిగాడు గాని ఈ పిల్లలు ఆ గోదాలో చేసే ధ్వని వినకుండా ఉండలేకపోయాడు. ఆ కేకలు, ఆ కేరిం తాలు అవన్నీ ఎవరు అదుపులో పెట్టగలరు?... ఒకవేళ ఎవరేనా ఆ సమయంలో ఏదేనా సలహా ఇస్తే అది వాళ్ళకు వినిపిస్తుందా?... వినిపించినా దాన్ని పాటిస్తారా?... ఆ చెప్పిన మనిషిని పట్టుకుని గేలి చెయ్యకపోతే చాలు...... నడుస్తున్నవాడు నడుస్తు న్నట్టు ఆగిపోయి వాళ్ళకేసి అదే పనిగా చూస్తూ నుంచునిపోయాడు.

వాళ్ళను చూస్తే అసూయగా ఉంది గోపాలానికి. ఏ బాదరబందీ లేకుండా వాళ్ళు ఎలాగ ఉండగలుగు తున్నారో ననిపించింది. తను కూడా వాళ్ళలాగ ఉండగలిగితే!... తనే అని ఏమిటి? ... అందరూ ఎప్పుడూ అలాగే ఉండగలిగితేనా? ... జీవితమంతా అంత స్వేచ్ఛగాను బాధ్యతారహితంగానూ గడప గలిగేవా డెవడేనా ఉంటాడా?... ఏం?...ఎందుకు ఉండడు? ... ఎవడేనా బోడ్డున మాణిక్యం పెట్టుకు పుడితే వాడు తప్పకుండా అలాగ ఉండవచ్చు... అయితే డబ్బున్న వాళ్ళంతా సుఖంగా ఉండరేం?... ఏ పని లేకుండా తిని తీరికగా కూచోరేం?... ఇది విపరీతంగానే ఉంది... అయితే ఇందులో ఒకటి ఉంది... ఉన్నవాళ్ళకే బాధలు బాధ్యతలు ఎక్కువ... లేనివాడికే జీవితం సుఖంగా వెడుతుంది... ఒళ్ళు మరచి సుఖంగా నిద్రన్నా పోతాడు. ఉన్నవాడికి అదీ లేదుగా?... ఇవన్నీ పిచ్చిపిచ్చి ఆలోచనలే...ఎందుకు ఇలాంటి ఆలోచనలు బయలుదేరు తున్నాయో!... అయినా అందరిని గురించి బాగా తెలిసి ఉన్నట్టు తను అనుకోవటం తప్పకాదూ? ... ఇందాకా సరిగ్గా ఆలోచించక అలా అనుకున్నాడు గాని నిజానికి ఉన్న వాళ్ళకు సుఖానికి లోటు లేదు. ఎటొచ్చీ మధ్యరకంగా ఉన్న తనలాంటి వాళ్ళకే లోటంతా!... తను అటు ఉన్నవాళ్ళల్లోకి చేరడు. ఇటు లేనివాళ్ళల్లోకి చేరడు. తనకు బొత్తిగా లేకపోలేదు. అలాగని ఉన్నదంతా సాగిస్తే ఏ ఒక్క అవసరానికీ చాలదు. ఎక్కడి కక్కడ అతుకులు పెట్టుకుంటూ చాలీచాలని బతు కులు బ్రతకాలి. ఏదో నెల కింత అని తెస్తూంటే గుట్టుగా జరిగిపోతుంది. అదికాస్తా లేకపోతే సంసారం వీధికి ఎక్కిందన్నమాటే. నిజం ఆలోచిస్తే ఇంతే గదా?... ఇలాంటివాళ్ళు ఎంద రున్నారు?...వీళ్ళం దరూ ఎంతో పరువు ప్రతిష్ఠలతోను, గౌరవప్రప త్తులతోను బ్రతుకుతున్నారు... అయితే ఆ ఆదా యం కాస్తా అదృశ్యమైన నాడు వీళ్ళనెవరు పలక రిస్తారు... పైగా ఎవరి దగ్గరకి వెళ్ళినా చీద రిస్తారేమో?...అంటే వీళ్ళందరికీ ఆ గౌరవం వాళ్ళవాళ్ళ వ్యక్తిత్వంవల్ల వచ్చిందా? ... వాళ్ళ కున్న డబ్బు వల్ల వచ్చిందా?... ఎంత ఆలోచించినా ఆ గౌరవం అంతా డబ్బును ఆశ్రయించుకుని ఉన్నదే అని తేలు తోంది... ఇది ఎంత చిన్న విషయం? ... దీనికని ఇంత ఆలోచించడమెందుకు?...అందరికీ తెలిసి ఉన్న విషయమేగా! నాలుగు డబ్బు లున్నవాడినే పదిమంది పొగుడుతారు. వాడి గుణగణాలను గురించిగా అంద రికీ చాటుతారు. ... ఇంకా ఎన్నో చేస్తారు... ఏమీ లేనివాడి దగ్గరికి వచ్చి ఇవన్నీ ఎవరు చేస్తారు?... అందుచేత డబ్బే ఎవరికేనా గౌరవాన్ని తెచ్చిపెట్టేది. ' అయితే ఈ పిల్లలు ప్రతిరోజూ ఇక్కడ కాలక్షేపం చేస్తారేం?... వీళ్ళకు తెలియదా— డబ్బు సంపాదించుకోకపోతే ప్రపంచంలో ఎందుకూ పనికిరారని?... ఇవన్నీ తనకు ఇవాళ కలుగుతున్న ఆలోచనలు గాని తనుమాత్రం వాళ్ళకు మల్లే ఆడు కోలేడూ?... అప్పుడు ఈ విషయాలన్నీ తనను బాధ పెట్టాయా?... ఇవాళ తనకు అన్నీ ఇలాంటి ఆలో చనలే కలుగుతున్నాయి. ఎందుచేతో?... అనుకుని కారణాలు అన్వేషిస్తున్నాడు గోపాలం.

"ఏరోయ్ గోపీ!... ఇక్కడున్నావు? ...మరేం విశేషం లేదు గదా!..." అని ప్రశ్నించింది పరిచిత కంఠం. దాంతో మళ్ళా ఆలోచన వదిలిపెట్టాడు. వులిక్కిపడి వెనక్కు చూచాడు. ఆ ప్రశ్న వేసింది వాడే.


"ఆఁ... ఏమిట్రా అన్నావు?" అని అడిగాడు గోపాలం అతని ముఖం, గొంతు కూడా స్పష్టంగా చెబుతున్నాయి ఇందాకా సుబ్బారావు వేసిన ప్రశ్న వినలేదని.

"ఎప్పుడూ రానివాడివి యిలా వచ్చావేమా?... అని..." అన్నాడు సుబ్బారావు.

"ఊరికేనే... ఏమీ తోచక" అని ముఖావంగా జవాబిచ్చాడు గోపాలం.

"ఓహో! అలాగా!" అని తన దారిని వెళ్ళిపోయాడు సుబ్బారావు.


ఊళ్ళోకి వెడుతున్నాడు సుబ్బారావు. వాడికేసే చూస్తూ నుంచున్నాడుగోపాలం. సుబ్బారావునుచూస్తే గోపాలానికి నవ్వు వచ్చింది. ఏ విషయాన్ని గురించీ తీవ్రంగా ఆలోచించడంగాని, మాటాడడంగాని ఎన్నడూ చెయ్యడు సుబ్బారావు. వాడికి వచ్చే జీతం తన కంటే ఎక్కువ కాదు. అయితేనేం?... వాడు శుభ్రంగా ఖరీదైన బట్టలు కట్టుకొని తిరుగుతాడు. రోజుకు రెండు రూపాయల దాకా కాఫీ హోటలు అయ్యరుకు చెల్లిస్తాడు. వారానికి నాలుగైదు సినిమా లైనా చూస్తాడు. వీటన్నిటికీ వీడికి డబ్బెక్కడిదో!... పైగా రోజంతా వీధిలోనే గడుపుతుంటాడు. ఇక ఈ గణాచారిగాడు పెళ్ళాం పిల్లలకు ఏంకావాలో కనుక్కున్న పాపాన పోయి వుంటాడా ఎప్పుడేనా?...



"ఏరోయ్ గోపీ! ఇక్కడున్నావు?" అని ప్రశ్నించింది పరిచిత కంఠం

వాడిని చూసి తను అలా అనుకున్నాడు గాని అవేమీ వాడు చూడకపోతే వాళ్లంతా ఎలా బ్రతుకుతున్నారు?...వీడిని వీధిలోనాలుగుసార్లు చూసి తనుఅలా అనుకోవటం ఏం ధర్మంగావుంటుంది?. . ధర్మం కాకపోవడం ఏమిటి?...వాడు అస మానం అంత స్వేచ్ఛగా తిరుగుతున్నాడంటే వాడికి యింటి బాదరబందీ ఏమీ లేదనే అనుకోవాలి మరి!... లేకపోతే అంత తెగించి ఎలాగ తిరుగ గలుగుతాడు?— తన మట్టుకు తనకు అలాగ పీలవుతోందా — ఎంత ప్రయత్నించినా? ...ఇంటికి వెళ్లేసరికి భార్య, పిల్లలు, ప్రపంచంలోని దైన్యాన్నంతామూటకట్టుకునిముఖంలోదాచిపెట్టుకుని దర్శన మిస్తారు. ఆ ముఖాలు చూసే తనకు కడుపు తరుక్కుపోతుంది. ఎంతో బాధ బయలుదేరుతుంది. ఒక్కొక్కసారి వాళ్ళమీద కోపంకూడా పుట్టుంది. ...కాని వాళ్ళమీద కోప్పడడం ఎందుకు? —తన తెలివి తక్కువ కాకపోతే? ...వాళ్ళకు నిత్యావసరాలు తీర్చేందుకేనా తగిన స్థితిలో తను లేడాయె! ...పైగా వాళ్ళ ననుకోవడం ఎందుకు?. .తను సంపాదించి కుప్పలు పోస్తే అది అనుభవించలేక బాధపడుతున్నారంటే వాళ్లను కేకలు వెయ్యవచ్చును. తను తెస్తున్నది అర్ధం లేకుండా అయినది ఆకులలోను కానిది కంచాలలోను పెట్టి తగలబెడుతున్నారంటే తప్పు వాళ్లదనవచ్చును. పోనీ తన సంపాదన చాలటం లేదనిగాని, తను వాళ్లను కష్టపెడుతున్నాడనిగాని ప్రత్యక్షంగా గాని పరోక్షంగాగాని ఎప్పుడేనావాళ్ళు అని వుంటే అప్పుడు వాళ్ళ నుశిక్షించవచ్చు ..ఇవేమీలేవే! .. ఆమాటకొస్తే తన భార్యగనక ఉన్న పిల్లలతో చాలీ చాలని సంపాదనతో గుట్టుగా సంసారం యీదుకొస్తోందిగాని మరొకత్తయితే యీపాటికి తనూ పిల్లలూ ఎలాంటి అవస్థలో వుండేవారో ఎవరు చెప్పగలరు? అం తెందుకు?.. ..... తనతో చదువుకున్న సౌబ్బారావును పెళ్లాం ఏం చేసింది? ఒక రోజున ఆపిడ అడిగిన వెంటనే వాసన నూనె, సెంటు తెచ్చి యివ్వక కొద్ది రోజులు ఆలస్యం చేశాడట. అంతే? . అదొక పెద్ద అఘాయిత్యంలాగ, అది ఆ క్షణంలో లేకపోతే తన పంచప్రాణాలూ పోయేటట్టు యింట్లో గొడవపెట్టిందిచాలక ఆ విషయం పూరా వాడా అందరికీ చాటివచ్చి అతన్ని యాగీ చేసిందట! ...అదేనా అతను "ససేమిరా! నేను కొనను" అననే లేదు. "ప్రస్తుతం చేతిలో డబ్బు లేదు . జీతం వచ్చాక కొంటాను" అన్నాడట. అది అతను చేసిన మహాపరాధం......కొందరు ఆ డ వా ళ్ళు యిలాగ వుంటారు.... అంత మట్టుకు తను అదృష్టవంతుడే!...

అయితే సుబ్బారావుకు ఉత్తారి వేషు ఆస్తి ఏదేనా కలిసిందేమో!. . లేకపోతే ఇంత జల్సాగా వుండగలడా? .. కాని అదేమీ వున్నట్టు కనబడదే? సుబ్బారావు పెళ్లికి తనుకూడా వెళ్ళాడు. ఆ మామగారు ఏమంత స్థితిపరుడు కాడనే గుర్తు. పెళ్లిలోనే సుబ్బారావుకు శుభ్రమైన గుడ్డలు పెట్టలేదు. ఇక అటునుంచి



ఏడికి ఆస్తి కలవడ మేమిటి? ...అదంతా వట్టి భ్రమ. మరి ఏం భరోసా పెట్టుకొనో విడిచి వెగని నీటు?...

ఇలా ఆలోచిస్తున్నాడు. ఇంతలో వాయువతో నిద్ర తీసుకొంటున్న పిల్లలు అందరూ లేచి బట్టలు కట్టుకుని ఇళ్లకు బయలు దేరారు. వాళ్ళ గోపాలం దృష్టిని ఆకర్షించారు. వచ్చినప్పటికన్నా నిర్విచారంగా వెళుతున్నారు వాళ్ళు. నిజంగా అల్ప్పప్పవలెను అంటే వాళ్ళు. ఇంత సేపు వానలో నానితే జబ్బు చేస్తుందనే భయం కూడా లేదు గదా? ...ఆహా! ...ఆరోజులే వెంచివి. మళ్లా ఆరోజులు రాకూడదా?... ఎందుకు వస్తాయి? ...వస్తే మాత్రం? ...అసలు అమాయిక్కి రాగు... తనకే నిజంగా భగవంతుడు ఎప్పుడైనా కనపడితే తను కోరే వరం యిదొక్కటే ...తనను మళ్లా ఏ బాధ్యతలు లేని బాలునిగా చెయ్యమని! ... అయ్యో! ఇదేమిటి? ...తను పసిపిల్లాడై పోతే మరి పెళ్ళాం పిల్లల గతి ఏంకాను? ......ఏంకానేమిటి? ...వా టన్నింటికీ తను బాధ్యుడా? ...బాధ్యుడు కాదూ! ...తను వాటన్నింటికీ బాధ్యత వహిస్తాడని ఏదో బోలెడంత నిర్వాకం చేస్తాడనీ ఆశతోనేగా ఆ మామగారు ఆ పిల్లను తన కిచ్చినది... ఇంత అప్రయోజకుడని ఆనాడే తెలిస్తే పిల్లనిచ్చేవాడా ఆయన! ...ఇదే మరి తన బాధ్యత! ...ఇవన్నీ అనవసరపు బంధాలే నిజానికి ...ఈ లోకంలో ఎవరికి ఎవర మవుతాము? ...ఎవరి కర్మకోసం వాడు పుట్టాడు. ...ఆకర్మ ననుసరించే కొందరితో పరిచయం కొందరితో బాంధవ్యం, మరి కొందరితో సంబంధం కలుగుతాయి. అవన్నీ యీ లోకంలో వుంటాయి... ఆ లోకంలోకి వెళ్తే ఇక ఇవ్వేమీ వేవుగదా! ...ఎవడి సంచితార్థం వాడితోనే వుంటుంది... ఇది గతి... ఈ ఆలోచన లేమిటి? ...ఇవాళ వేదాంతంలో పడ్డాడు తను! ...వెర్రి ముదిరి వేదాంతి అవుతాడట! ...ఏమిటో! ...ఈనాటి తన స్థితిలో అన్నీ యిలాంటి ఆలోచనలే వస్తున్నాయి. ఏ ఒక్క విషయాన్ని గురించి సరిగా ఆలోచించలేకున్నాడు.

"ఏం గోపాలం గారూ? ...ఇంకా ఇంటికి వెళ్ళ లే దేమిటి?" అని ప్రశ్నించాడు అప్పుడే అక్కడకు వచ్చిన హెడ్ గుమాస్తా సూర్యం.

"ఆ !... లేదండి!... ఏది... ఇంకా... ఇప్పుడేగా...ఆఫీసునుంచి వస్తా!..." అంటూ మాటలు తడబడుతూ జవాబు చెప్పాడు గోపాలం.

"మీకు కోపం రాదంటే ఒక్క మాట చెప్తాను... ఇవాళ మీరు చేసిన పని అంత మంచిది కాదు... ఆవేశంలో అలాగ చేశారు... కాని స్థిమితంగా కూచుని ఆలోచిస్తే మీకే తెలుస్తుంది..." అని సలహా ఇచ్చాడు సూర్యం.

గోపాలం జవా బేమీ చెప్పకుండా శూన్యంలోకి చూస్తున్నాడు.

"ఆయన అలా అనటం తప్పు కాదని అనను... కాని ఆయన అధికారి. మనం గుమాస్తాలం... అంచేత కొంత ఓపిక పట్టాలి." అని అభిప్రాయాన్ని వివరించాడు సూర్యం.

"గుమాస్తా అయినంత మాత్రాన ఇంక పై వాళ్ళు తమ ఇష్టం వచ్చినట్లు అనొచ్చునా?...వీళ్ళకుమాత్రం వ్యక్తిత్వం, అభిమానం... ఉండవూ?... ఎదురు ప్రశ్న వేశాడు గోపాలం.

"నువ్వు చెప్పినది నిజమే. నాన నాని ఏక ప్రపంచంలో కాదు. ఆదర్శ ప్రాయమైన ప్రపంచం ఎలా ఉండాలో ఊహించుకుంటే అందులో అలాగ ఉంటాయి. ఈ ప్రపంచంలో మనుష్యులు ఇప్పటికీ అలాగే ఉన్నారుగాని మారలేదు. కొన్ని లోపాలు ప్రతి వాడికీ తప్పవు. అది చూసుకుని జాగ్రత్తగా సర్దుకు పోవటంలోనే ఉంది తెలివి. అంతేగాని..."

"అయితే మరి ఆ లోపమే మనలో ఉంటే మనను ఎదుటివాళ్ళు కూడా అలా క్షమించవచ్చుగా?

"అయ్యో!... ఎంత పిచ్చివాడవయ్యా!... అలాగ చెయ్యలేం గనకనే మనం మానవులయ్యాం. లేక పోతే దేవతలమే అవుదుము. మన లోపాలు మనకు కనిపించవు.... ఎదుటి వాడివి స్పష్టంగా కనిపిస్తాయి. మనం తప్పుచేస్తే క్షమించటం ధర్మం అనుకుంటాం. ఎదుటి వాడు ఆ తప్పే చేస్తే క్షమించ రాదని తీర్మానిస్తాం. అందు చేతే..."

"సరే!... ఇప్పుడు నా తప్పేమి చెప్పండి—ఆయన అంత మాట అనటానికి?..."

"అదుగో మళ్ళా మొదటికి వచ్చావు. తప్పెవరిది? తప్పేమిటి? అనే ప్రశ్నలకు అసలు అవకాశమే లేదు.... ఈ చర్చల్లోకి వెడితే ఎక్కడికి వెడతామో మనకే తెలియదు. కనుక ఇంక ఇంతటితో వదలి పెట్టి ప్రస్తుతానికి వద్దాం... ఇక్కడ అవసరం మనది... ఉద్యోగం ఎంత చిన్న దయినా... మన బ్రతుకులకు చాలా అవసరం... అదే ఆధారం మనకు. అంచేత ఏది ఎలాగున్నా ఆ ఉద్యోగం మాత్రం వదలుకో కూడదు. ఒకసారి వదులుకుంటే ఈ రోజుల్లో తిరిగి ఉద్యోగం సంపాదించుకునే కాలం కాదు. నీ వ్యక్తిత్వాలు అవ్వీ నీకు వెనకాల బాగా ఆస్తి పాస్తులుండి ఈ ఉద్యోగం పోయినా భయం లేనప్పుడు. ఇప్పుడు అలాంటి వాళ్ళు కూడా లొంగే ఉంటున్నారు. కనుక నీ దృష్టి ఎప్పుడూ ఈ విషయం మీదే ఉండాలి. నీకు ఇది ఇంత అవసరం అన్న మాట నువ్వు కాదంటావా?... అనలేవు — నాకు తెలుసు... కాబట్టి మిగిలినవన్నీ ఏమయినా ఇది పోయే మాట అనటంగాని చేత చెయ్యటం గాని కూడదు.... పైగా ఇది నీ ఒక్కడికేనా వస్తున్నది!... నీ ముందు వాళ్ళంతా ఈ అవస్థలు పడి, ఈ ఆలోచనలు చేసిన వాళ్ళేగా!... వాళ్ళకు ఈ మాత్రం తెలిసి తేటలు లేక పోయాయంటావా?... కాదే!... కాబట్టి నువ్వు కూడా ఆవేశం వదులుకొని, నా మాట విని, రేపు మామూలు పనిలోకి రా!..." అని సలహా ఇచ్చాడు సూర్యం.

"మరి ఇవాళే రాజీనామా వ్రాసి ఇచ్చేశాను?..." ప్రశ్నించాడు గోపాలం.

"అదే తప్పని అన్నాను నేను. ఒక్క క్షణంలో కోపం వచ్చి రాజీనామా ఇచ్చేశావు. దీనివల్ల నువ్వు నిలబెట్టిన వ్యక్తిత్వం ఏమిటి?... రేపటినుంచి ప్రతి కార్యాలయానికివెళ్ళి ఇంతకంటే హీనంగా బతిమాలవద్దూ?... అప్పుడు నీ వ్యక్తిత్వం, ఆత్మ గౌరవం ఏమవుతాయి?... ఇం కెప్పుడూ ఇలాంటి పిచ్చి ఆలోచనలు చెయ్యకు ... కుర్రతనం ఇంకా వదలలేదు నీకు... నువ్విచ్చిన కాగితం మాసి ఆయనే నన్ను నీ దగ్గరికి పంపారు. సముదాయించి తీసుకురమ్మని... ఆ క్షణంలో పని విషయంలో అవసరమయి కేకలు వేశారంటే ఇక నువ్వు ఆయనకు పరమ శత్రువు వవుతావా? ... అందులోనూ ఆయనను గురించి నీకు ఇంకా పూర్తిగా తెలియదు.... ఒక వేళ ఆయన చెడ్డ వాడే అనుకో!... నష్ట పోయిం దెవరు? అప్పుడు ఆవేశ పడ్డావు... ఇప్పుడు ఇంటికి వెళ్ళేందుకు ముఖం చెల్లక, చేసిన దానికి పశ్చాత్తాప పడుతూ ఇక్కడ కూచున్నావు. ... పోనీ ఇది వదిలేస్తే మనకేం? మరో ఉద్యోగం! అనుకుందుకు ఏదేనా సిద్ధంగాఉందా? అదీ లేదే!...నేను అన్నీ ఆయనకు సర్ది చెప్పేను. ఆయన కూడా నిన్ను తీసుకు రమ్మన్నారు... ఇంత జరిగినట్లు ఇంట్లో తెలియకముందే లేచి సరిదిద్దు కో! నా మాట విను..." అంటూ గోపాలం చెయ్యి పట్టుకు లేవదీశాడు సూర్యం.

ఆ మాటలు చివరికంటా విన్న కొద్దీ వాటిల్లో నిజం కనిపించింది గోపాలానికి. ... పైగా తను ఏదైనా సాధించ దలచుకుంటే అక్కడే వుండి తన ప్రవర్తన వల్ల ఆయన మెప్పు పొందాలి గాని, ఆయనతో తెగ తెంపులు చేసుకుని వెళ్ళి పోతే సాధించేది ఏమిటి?... కనుక సూర్యం సలహాసే బాగుంది — అనుకుంటూ సూర్యం వెనకాలే వెళ్ళాడు.

మర్నాడు ఆఫీసులో గోపాలం ఇదివరకటి లాగే ఒక గుమాస్తా. పూర్వానికీ ఇప్పటికీ తేడా ఏమీ లేదు. ఉన్నదల్లా గోపాలం ఆవేశం తగ్గించుకున్నాడు.... ఆవేశ పడడం మంచిది కాదనో?... కాక పోతే ఆవేశ పడదగ్గ స్వామత తనకు లేదు అనో?... ★


## తెల్ల వెంట్రుకలను పోగొట్టును

(గవర్నమెంటు రిజిస్టర్డు)

రంగులనుచూచి మోసపోవద్దు. అది తాత్కాలికము. మా సువాసనగల "మన్ మోహిని హేర్ ఆయిల్" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారైనది 60 సం॥ల వయస్సువరకు వెంట్రుకలను నల్లగావుంచును. కొద్దిగా నెరసివుంటే ఒక సీసా రు 3-8-0. 3 సీసాలు రు. 9-0-0. సగము నెరసివుంటే ఒక సీసా రు. 5-0-0. 3 సీసాలు రు. 12/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు 7/- లు. 3 సీసాలు రు 18/- లు ఇది పనిచేయదని నిరూపించిన రు 500/-

**BEHAR LABORATORIES,**
**(52) P.O., Rajdhanwar (H. Bagh.)**